సాక్షి
కాకినాడ

గురువారం । 5 । అక్టోబర్ । 2023



హుండీ లెక్కింపు

బోట్‌క్లబ్ (కాకినాడ): స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీలను బుధవారం లెక్కించగా రూ.9.37 లక్షలు ఆదాయం వచ్చింది.



వృద్ధురాలి దారుణ హత్య

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరులో తల్లోజు పార్వతి (75) దారుణ హత్యకు గురైంది. తన ఇంట్లో మంగళవారం రాత్రి నిద్రించిన ఆమె బుధవారం ఉదయానికి రక్తపు మడుగులో పడి ఉంది.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి బుధవారం 2,22,141 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. భద్రాచలం వద్ద 20.20, బ్యారేజ్ వద్ద 10.45 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి పోటీలకు జయభారతి ఎంపిక



పోకల జయభారతి

కిర్లంపూడి: జాతీయ స్థాయి గణిత విజ్ఞాన మేళా పోటీలకు కిర్లంపూడికి చెందిన విద్యార్థిని పోకల జయభారతి ఎంపికైంది. స్థానిక విజ్ఞాన భారతీ స్కూల్‌లో చదువుతున్న జయభారతి ఈ నెల 1, 2 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞాన మేళాలో సైన్స్ ఎంపర్‌మెంట్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరిగే ఆలిండియా లెవల్ గణిత విజ్ఞాన మేళాలో ఆమె పాల్గొంటుందని పాఠశాల హెచ్‌ఎం గాడి శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జయభారతిని పలువురు ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

తైక్వాండో పోటీలకు కాకినాడ విద్యార్థి వశిస్ట్ ఎంపిక

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14,17 ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో ఎంపికల్లో కాకినాడకు చెందిన పి.వశిస్ట్ ప్రతిభను కనపరిచాడు. అండర్–17 విభాగంలో 59 కేజీల విభాగంలో జిల్లాస్థాయి ఎంపికల్లో ప్రథమస్థానం పొందాడు. బుధవారం జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17 ఎంపిక కమిటీ అధికారుల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అర్హత పత్రాలు అందుకున్నాడు. . గుంటూరులో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్–14, 17 పోటీలలో జిల్లా తరుపున పాల్గొంటాడు. వశిస్ట్ స్థానిక రామారావుపేటలోని నారాయణ ఇ–టెక్నో స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నాగేశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సందీప్

తుని: స్థానిక కొండవారిపేటకు చెందిన సాకా నాగేశ్వరరావు కాకినాడ జీజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. అతను సామాజిక పింఛనుదారుడు కావడంతో వార్డు వలంటీర్ సందీప్ సొంత ఖర్చులతో తుని నుంచి కాకినాడ వెళ్లి ఐసీయూలో చికిత్స పొందుతున్న నాగేశ్వరరావుకు పింఛన్ సొమ్ము అందజేశారు. ఇది జరిగిన కొంత సమయం తర్వాత నాగేశ్వరరావు తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న వలంటీర్ సందీప్ విచారం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ

పిఠాపురం: స్థానిక బాస్కెట్ బాల్ క్రీడా మైదానంలో శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచినట్టు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు బుధవారం తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో గత నెల 29 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పురుషుల జట్టు ప్రథమ స్థానం, మహిళల జట్టు తృతీయ స్థానం సాధించాయని తెలిపారు. విజేతలకు పిఠాపురంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆర్థిక సాయంతో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు కొత్తెం సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెట్లపై నుంచి జారిపడి బాలుడి మృతి

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో మెట్లపై నుంచి జారిపడి 17 నెలల బాలుడు మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లి గ్రామానికి చెందిన పదిలం శ్యామ్‌కు వివాహమైంది. అతనికి వెంకటదుర్గసాయివేదాస్ అనే 17 నెలల కుమారుడు ఉన్నాడు. బుధవారం శ్యామ్ తన ఇంటి మేడపైకి వెళ్లగా అతని వెనుక కుమారుడు కూడా వెళ్లాడు. ఈ క్రమంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి కిందకు జారి పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

అన్నం కాదు.. ఔషధం



- సంతులిత పోషకాల సమాహారంగా ఫోర్టిఫైడ్ రైస్
- గర్భిణులు, బాలింతలకు ఎంతో ప్రయోజనం
- పోషకాహార లోపాల నివారణకు ప్రభుత్వం చర్యలు
- ప్లాస్టిక్ రైస్ అంటూ అపోహలు
- అంగన్వాడీల అవగాహనా కార్యక్రమాలు

కాకినాడ క్రైం: పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. మాతాశిశు మరణాల నియంత్రణ, పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించిన ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్‌తో సమస్యకు చెక్ పెడుతోంది. పోషకాలు శరీరాన్ని చేరేందుకు వేసుకోవలసిన మాత్రలు, ప్రత్యేక ఆహారాల పట్ల ఎందరో గర్భిణులు, బాలింతలు అవగాహనా రాహిత్యంతో వ్యవహరిస్తున్నారు. ఈ స్థితి ప్రసవించే వారిలో మాతాశిశు మరణాలకు, ప్రసవించిన వారిలో శిశువుల ఎదుగుదల లోపాలకు కారణమవుతోంది. ఆరోగ్య పరమైన అనేక సమస్యలకు పరిష్కారంగా ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రభుత్వం పరిచయం చేసింది. ఈ బియ్యం అందుబాటులోకి వచ్చి



ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ రైస్ ప్యాకెట్లు

నెలలు గడిచినా ఇప్పటికీ వినియోగంపై అపోహలు ఉన్నాయి. వాటిని తొలగించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్ రైస్ అంటే...

ఫోర్టిఫైడ్ రైస్‌ను వాడుక భాషలో బలవర్ధక బియ్యంగా పిలుస్తారు. సాధారణ బియ్యానికి ఈ బియ్యానికీ అనేక అంశాల్లో సారూప్యత ఉంది. వాటితో పోల్చుకుంటే బలవర్ధక బియ్యంలో పోషకాలు మెండు. పోషకాలను బియ్యం రూపంలో మార్చి ప్రత్యేక గింజలు తయారు చేసి సాధారణ బియ్యంలో కలుపుతారు. వీటిని జతచేసి పంపిణీ చేస్తారు. ఈ కృత్రిమ బియ్యాన్ని కెర్నల్స్ అంటారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి వంద కిలోల బియ్యానికి వ్యక్తి ఆరోగ్య స్థితి అవసరాన్ని బట్టి(సరఫరా అయ్యేది బాలింతలకా, గర్భిణులకా, లేదా సాధారణ వ్యక్తులకా అనే అంశం పరిగణలోకి తీసుకుంటారు) ఒక కిలో లేదా రెండు కిలోల కెర్నల్స్‌ని కలుపుతారు.

ఇలా వండుకుంటే మేలు...

బలవర్ధక బియ్యంలో జతచేర్చిన పోషకాలను కోల్పోకుండా ఉండాలంటే ప్రత్యేక వంట విధానాన్ని అవలంభించాలని కాకినాడ సీడీపీవో దయామణి వెల్లడించారు.

- ఫోర్టిఫైడ్ రైస్ కడిగేటప్పుడు అతిగా రుద్దకూడదు. వండే ముందు కొంత సేపు నీటిలో ఉంచి ఆ నీటిని ఒంపేయాలి. మరో మారు నీరు వేసి సున్నితంగా కడగాలి. తద్వారా పోషకాలు కోల్పోవు.
- అన్నం వండేటప్పుడు నెయ్యి, దాల్చిన చెక్క, జీలకర్ర, యాలికలు, లవంగాలు వంటి దినుసులు జోడిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
- ఫోర్టిఫైడ్ రైస్‌లో పోషకాలు మరింత ద్విగుణీకృతం చేసేందుకు సగం నీరు, సగం పాలు కలిపిన ద్రవంలో ఉడికిస్తే మేలు. పిల్లలకు ఈ విధానం మరింత బలవర్ధకం
- ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఎప్పుడూ మూత పెట్టి ఉడికించాలి. తెరిచిన పాత్రలో వండితే పోషకాలు ఆవిరి రూపంలో కోల్పోవలసి ఉంటుంది.
- అల్యూమినియం కుక్కర్లకు బదులుగా స్టీలు, గాజు, మట్టి పాత్రల్లో వండటం పోషకాల నిలుపుదలకు దోహదపడతాయి.

ప్లాస్టిక్ బియ్యం కాదు

ఫోర్టిఫైడ్ రైస్ ప్రాధాన్యతను గుర్తించక పలువురు గర్భిణులు, బాలింతలు ప్లాస్టిక్ రైస్ అంటూ తప్పుడు ప్రచారాలను నమ్ముతున్నారు. సాధారణంగా సంతులిత పోషకాలతో నిండిన కృత్రిమ బియ్యానికి ప్రత్యేక గుణముంది. తయారీ ప్రక్రియలో పోషకాల చేరికలోని హెచ్చుతగ్గుల కారణంగా, వాటిలో కొన్ని నీటిలో తేలే గుణాన్ని కలిగి ఉంటాయి. అలా తేలిన బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా భ్రమ పడుతున్నారు. ఇవి ప్లాస్టిక్ బియ్యం కాదంటూ భద్రంగా వినియోగించుకోవచ్చంటూ నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేస్తారు

- శాస్త్రీయ విధానంలో సిద్ధం చేసిన విటమిన్లు, సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పిండి రూపంలో చేసి బియ్యం పిండితో కలిపి ఎక్స్‌ట్రూడర్ యంత్రంలోకి ప్రవేశ పెడతారు.
- కొంత సమయం తర్వాత ప్రత్యేక పక్రియ ద్వారా పిండి మిశ్రమం గింజలుగా మారుతుంది.
- అచ్చం బియ్యం ఆకారంలో ఉండే వీటి పొడవు గరిష్టంగా 5 మిల్లీ మీటర్లు, వెడల్పు 2.2 మిల్లీ మీటర్లు ఉంటాయి.
- సాధారణ బియ్యానికి సరిసమానమైన కొలతలతో సిద్ధమవుతాయి.
- వీటినే శాస్త్రీయంగా ఫోర్టిఫైడ్ రైస్ కెన్నల్స్(ఎఫ్ఆర్‌కే) అంటారు.
- ఈ ఎఫ్ఆర్‌కేలను తదుపరి ప్రక్రియలో భాగంగా వంద కిలోల బియ్యానికి గరిష్టంగా రెండు కిలోల చొప్పున బ్లెండర్ యంత్రంలో వేస్తారు.
- బ్లెండర్ ఈ మిశ్రమాన్ని పూర్తి స్థాయి ఫోర్టిఫైడ్ రైస్‌గా మారుస్తుంది.
- సిద్ధమైన బలవర్ధక బియ్యాన్ని ప్రత్యేక ప్యాక్‌లలో సిద్ధం చేస్తారు.
- ఫోర్టిఫైడ్ బియ్యం ప్యాక్ చేసిన ప్రతి ప్యాక్‌పై 'ఎఫ్' అనే ప్రత్యేక గుర్తును ముద్రిస్తారు.

అవగాహనతో సత్ఫలితాలు



ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా భ్రమ పడి వినియోగించడం మానేసిన దాఖలాలు అనేకం ఉన్నాయి. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల కృషితో ఈ సమస్య కొంత వరకు సద్దుమణిగింది. వారి కృషి సత్ఫలితాలనిచ్చింది. గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెరిగింది. సత్ఫలితాలు గుర్తించిన ప్రభుత్వం ఇవే బియ్యాన్ని సామాన్య ప్రజలకూ పంపిణీ చేస్తోంది. ఈ బియ్యం ఏడాది పాటు పాడవకుండా ఉంటాయి. పంపిణీలో నాణ్యత పెంచేలా కొద్ది రోజుల నుంచి మూడు కేజీల బియ్యం ప్యాకెట్లను ప్రభుత్వం అందజేస్తోంది.

– కే.ప్రవీణ, ఐసీడీఎస్ పీడీ

కిలో ఫోర్టిఫైడ్ రైస్‌లో ఉండే మూలకాలు

ఐరన్	: 42.5 మిల్లీ గ్రాములు
ఫోలిక్ యాసిడ్	: 125 మైక్రోగ్రాములు
విటమిన్ బి 12	: 1.25 మైక్రోగ్రాములు
జింక్	: 15 మిల్లీ గ్రాములు
విటమిన్ ఏ	: 700 మైక్రోగ్రాములు
విటమిన్ బి1	: 1.5 మిల్లీ గ్రాములు
విటమిన్ బి2	: 1.75 మిల్లీ గ్రాములు
విటమిన్ బి3	: 20 మిల్లీగ్రాములు
విటమిన్ బి6	: 2.5 మిల్లీ గ్రాములు

జిల్లాలో గణాంకాల ప్రకారం

ఐసీడీఎస్ ప్రాజెక్టుల సంఖ్య - 9

మొత్తం అంగన్వాడీ కేంద్రాలు - 1986

గర్భిణుల సంఖ్య - 10862

రక్తహీనత, సూక్ష్మపోషకాల లోపమున్న గర్భిణులు - 4,972

బాలింతలు : 10,603

ఐరన్, సూక్ష్మపోషకాల లోపమున్న బాలింతలు : 3,514

6 నెలల నుంచి ఆరేళ్లలోపు బాలలు 1,04,288

పోషకాహార లోపమున్న బాలలు 12,759



గర్భిణికి ఫోర్టిఫైడ్ రైస్ అందజేస్తున్న పర్లోవపేట అంగన్వాడీ టీచర్ కర్రి సత్యవేణి

ధ్వజస్తంభానికి తెనాలిలో కర్ర ఎంపిక

- బంగారు తాపడానికి రూ.3కోట్లు అవుతుందని అంచనా
- వచ్చే జనవరిలో ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు: ఈఓ

అన్నవరం: రత్నగిరి కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంలో మరో మూడు నెలల్లో కొత్త బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు కానుంది. నెల్లూరుకు చెందిన దాత ఒకరు రూ.3 కోట్ల వ్యయంతో ధ్వజస్తంభం, దానికి బంగారు తొడుగు అమర్చేందుకు ముందుకు వచ్చిన విషయం విదితమే. ధ్వజ స్తంభం కోసం దేవతా వృక్షంగా పిలిచే 'నారేప' జాతి కర్రను బుధవారం ఎంపిక చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో 64 అడుగుల నారేప జాతి కర్రను ఎంపిక చేసినట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ మీడియాకు తెలిపారు. గతంలో రంపచోడవరంలో కొన్ని టేకు చెట్లను ఈ ధ్వజ స్తంభం కోసం పరిశీలించారు. అవి బాగోకపోవడంతో తెనాలిలో కర్రను దాత, దేవస్థానం వేదపండితుడు గొల్లపల్లి ఘనాపాఠీ, ఏసీ రమేష్ బాబు, విశ్రాంతి స్థపతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించామన్నారు. ఆలయానికి ఎదురుగా గల అనివేటి మండపంలో కొత్త ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేసి బంగారురేకు తాపడం చేయనున్నట్టు ఈఓ తెలిపారు. ప్రస్తుతమున్న ధ్వజ స్తంభం కర్ర పూర్తిగా పాడైపోయిందన్నారు. కొత్తది ఏర్పాటు చేయాలని దేవస్థానం వైదిక కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. తెనాలిలో ఎంపిక చేసిన నారేప కర్రను ట్రాలీ మీద అన్నవరం దేవస్థానానికి తీసుకువస్తారన్నారు. వచ్చే జనవరిలో ఉత్తరాయణ పుణ్యకాలంలో దీనిని దాత సమక్షంలో పండితుల ప్రతిష్ఠిస్తామని ఈఓ వివరించారు.



తెనాలిలో నారేప కర్రను పరిశీలిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్, ఏసీ రమేష్ బాబు, గొల్లపల్లి ఘనాపాఠీ, విశ్రాంతి స్థపతి ప్రసాద్

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అగ్రాసనం

రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. బుధవారం కోటనందూరు మండలం ఇండుగపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కుంచే సత్యవతితో కలిసి పారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ సగటు పేదవాడి ఇంటి ముంగిటకే రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం తీసుకు వస్తోందన్నారు. నిష్ణాతులైన వైద్యుల ద్వారా 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తోందన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం బాగుంటుందని సీఎం జగన్ ఆలోచన అన్నారు. వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను మంత్రి రాజా పరిశీలించారు. రోగులకు చేస్తున్న పరీక్షలు, అందిస్తున్న మందులు, ఓపీ తదితర వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. కోటనందూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని ఆధ్వర్యంలో 300 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, సర్పంచ్ సుర్ల రాంబాబు, ఏఎబీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే అచ్చిరాజు, గుడివాడ ఆదినారాయణ, కొరుప్రోలు కృష్ణ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తహసీల్దార్ కుశరాజు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

సీఎం లక్ష్యం.. ఆరోగ్యాంధ్రప్రదేశ్

- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- ఎంపీ వంగా గీత
- కాకినాడలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ.

కాకినాడ: ప్రతి పేదవానికి మెరుగైన ఆరోగ్య సేవలు అందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక కొండయ్యపాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభమైంది. ఎమ్మెల్యే ద్వారపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ గీత మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య రంగంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న పాలనా సంస్కరణలు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో యూపీహెచ్‌సీల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రెండు వేల జనాభాకు వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, పోస్టుల భర్తీ వంటి ఎన్నో చర్యలను సీఎం తీసుకున్నారన్నారు. 24 గంటలూ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ చేయడమే సీఎం లక్ష్యమన్నారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణం సీఎం ప్రాధాన్యతలుగా పేర్కొన్నారు. ఒక వైద్యుడు ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో వైఎస్సార్ పాలన ద్వారా చూశామన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎంగా తండ్రికి మించిన పరిపాలన అందిస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ప్రతి అర కిలోమీటరుకు ఒక్కొక్క అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోగలిగామని, వీటివల్ల పేదలకు మరింత దగ్గరగా ఆరోగ్య సేవలు అందుతున్నాయన్నారు. ఐదు డివిజన్లలో 28 వేల కుటుంబాలను ప్రభుత్వ వైద్య సిబ్బంది స్వయంగా కలసి సర్వే చేసి, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారన్నారు. సుమారు 170 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఇళ్లకు వచ్చే ఏఎన్‌ఎంలు, ఇతర వైద్య సిబ్బందికి ఆరోగ్య సమాచారాన్ని అందించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. నిపుణులైన వైద్యుల ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం తోడ్పడతామన్నారు.

కొండా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మాజీ కార్పొరేటర్లు కొలగాని దుర్గాప్రసాద్, కర్రి శైలజ, బాలాప్రసాద్, ఇమిడిశెట్టి వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కేస్‌షీట్‌ను అందజేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కొండబాబూ కనీస జ్ఞానం లేకుండా విమర్శలా..

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఫైర్

కాకినాడ సిటీ: కాకినాడలోని ఎంఎస్ఎన్ ఛార్టీస్ కళాశాల, పాఠశాల గ్రౌండ్ అభివృద్ధికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే కొండబాబు చేస్తున్న విమర్శలపై సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహనా రాహిత్యంతో, రాజకీయ స్వార్థంతో నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. బుధవారం ఆయన ఎంఎస్ఎన్ చార్టీస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చార్టీస్‌లో విద్యార్థుల ఇబ్బందుల గురించి తెలుసుకుని పాఠశాల, కళాశాలలను సందర్శించానన్నారు. అప్పుడు విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం సీసీ రోడ్డు వేయించామన్నారు. గ్రౌండ్ అభివృద్ధి చేసి వచ్చే జనవరిలో ఇక్కడ ఫ్లడ్‌లైట్ వెలుగులో క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తానని కూడా మాట ఇచ్చాను. ఆ ప్రకారమే గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. డంపింగ్ యార్డు చెత్తతో పూడుస్తున్నారని, మున్సిపల్ నిధుల నుంచి టెండర్ పిలిచి డబ్బులు దోచుకున్నారని కొండబాబు చేస్తున్న విమర్శల గురించి ద్వారంపూడి ప్రస్తావించారు. కనీస జ్ఞానం లేకుండా మాట్లాడటం తగదన్నారు. మున్సిపల్ నిధులు ఎంఎస్ఎన్ చార్టీస్‌లో ఖర్చు చేయడానికి వీలుందో కూడా తెలియదా అని ప్రశ్నించారు. గ్రౌండ్‌ను అభివృద్ధికి రూ.50 లక్షలు ఎమ్మెల్యే గ్రాంటు నుంచి కేటాయించామన్నారు. విద్యార్థులకిచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు మొదలు పెట్టామన్నారు. రాగంపేటలో మోడరన్ కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నాం. 20 సంవత్సరాల క్రితం ఆ స్థలం డంపింగ్ యార్డు. అక్కడ పునాది వేస్తున్నాం కనుక ఆ మట్టిని ఎంఎస్ఎన్ ఛార్టీస్‌లో వేసి ఉపకరించేలా చేద్దామన్నాను. శాలిపేట పాఠశాల భవనాల డెబ్రిస్ కూడా ఇక్కడికే తరలించమన్నాను. గ్రౌండ్‌గా తీర్చిదిద్దాలంటే గ్రావెల్‌తో ఫిల్లింగ్ చేయాలి. ఇందుకు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చు చేసే పరిస్థితి ఎంఎస్ఎన్ చార్టీస్‌కు లేదు. అందుకే సొంత నిధులతో ఫిల్లింగ్ చేయాలని ఆలోచించాను. అంతేకాదు ఈ ప్రాంతంలో ఒక అడుగు గ్రావెల్ కప్పి లాన్ పెంచాలనేది ఆలోచిస్తున్నాను. అంతే తప్ప టెండర్ పిలిచి నిధులు తినేసే అవసరం మాకు లేదు. నోటికి ఏది వస్తే అది మాట్లాడితే నమ్మే పరిస్థితిలో కాకినాడ నగర ప్రజలు లేరనిది తెలుసుకో అంటూ కొండబాబును ఉద్దేశించి అన్నారు. రేపటి నుంచి గ్రావెల్ ఫిల్లింగ్ చేయిస్తాను. సొంత డబ్బులు రూ.20 లక్షలు ఖర్చు చేసి పాఠశాలను అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే ద్వారంపూడి వివరించారు. వచ్చే జనవరిలో ఇదే ప్రాంతంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా మాజీ చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్లు మీసాల దుర్గాప్రసాద్, ఎంజీకె కిషోర్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, సంగాని నందం, భీమరాజు, వెలమల మల్లేశ్వరరావు, జగన్నాధన్ విజయకుమార్, చవ్వాకుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశం మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

క్లుప్తంగా

ఉరి వేసుకుని వృద్ధుడి మృతి

దబ్బే అన్నింటికి మూలమని.. సూసైడ్ నోట్

కాకినాడ రూరల్: చిన్న చిన్న పనులు చేసుకుంటూ అపార్టుమెంట్‌లో ఒంటరిగా ఉండే ఆ వృద్ధుడు బలవన్మరణం పొందాడు. ఐదేళ్లుగా అద్దెను సక్రమంగా చెల్లించడంతో పెద్దగా పట్టించుకోని అపార్టుమెంట్ యజమాని, ఏడాదిగా సరిగా అద్దె చెల్లించకపోయినా ఇబ్బంది పెట్టలేదు. నా అన్న వాళ్లు లేక, పని లేక పూట గడవడమే కష్టంగా భావించిన ఆ వృద్ధుడు ఇక చావే గత్యంతరంగా భావించాడో ఏమో ఉరి వేసుకుని చనిపోయాడు. ఇది జరిగి నాలుగు రోజులు జరిగిన తరువాత అపార్టుమెంట్ నుంచి వచ్చిన దుర్గంధం ఆధారంగా విషయం బుధవారం బయట పడింది. పోలీసులు వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ విద్యుత్‌నగర్‌లో వంశీకృష్ణా అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న బోడపాటి వెంకటేశ్వరరావు(61) బెడ్‌రూమ్‌లో లుంగీపంచెతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత నెల 30న వాచ్‌మన్‌తో అమలాపురం వెళుతున్నట్టు తెలిపి కనిపించలేదు. బుధవారం దుర్గంధం ఎక్కువగా రావడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా, బెడ్ రూమ్‌లో పూర్తిగా పాడైన స్థితిలో వెంకటేశ్వరరావు మృతదేహం ఉన్నట్టు గుర్తించారు. అపార్టుమెంట్ యజమాని శర్మ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. సర్పవరం ఎస్సై అజయ్ బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో 'డబ్బే అన్నింటికి మూలమని' రాసి ఉందని చెప్పారు.

భువనేశ్వరికి పలువురి సంఘీభావం

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి పలువురు నేతలు, వివిధ వర్గాల వారు కలిసి సంఘీభావం తెలిపారు. రాజమహేంద్రవరం విద్యానగర్‌లోని లోకేష్ క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎంపీ హర్షకుమార్, ఎమ్మెల్యే గంటా, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, బుద్దా నాగజగదీశ్వరరావు సంఘీభావం తెలిపారు. బాబు అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి గౌతమీ ఘాట్ వద్ద జలదీక్ష చేపట్టారు. బాబు జ్యుడీషియల్ రిమాండ్ 25వ రోజుకు చేరింది. ఎప్పటిలాగే బాబు జైలు జీవితం సాగింది. చంద్రబాబు తనయుడు లోకేష్ గురువారం రాత్రి రాజమహేంద్రవరం రానున్నారు. శుక్రవారం బాబుతో సెంట్రల్ జైల్లో ములాఖత్ కానున్నట్లు తెలిసింది. లోకేష్ గత నెల 14వ తేదీన ఢిల్లీ వెళ్లినప్పటి నుంచి అక్కడే ఉన్నారు. పవన్, లోకేష్ ములాఖత్ అనంతరం న్యాయపరంగా చర్చించేందుకు వెళ్లి 22 రోజుల అనంతరం రాజమహేంద్రవరం వస్తున్నారు.

సత్తెన్న ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- భక్తుల అవసరాలకు తగ్గట్టుగా రూపకల్పన
- నెలాఖరులోగా కమిషనర్‌కు ప్రతిపాదనలు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివిధ నిర్మాణ పథకాలకు సంబంధించి గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో కొన్ని మార్పులు చేసి కొత్తది రూపొందించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. దేవస్థానానికి వచ్చే భక్తులు పెరుగుతున్న నేపథ్యంలో రోడ్లు, పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధి, వసతి సత్రాల నిర్మాణం తదితర మార్పులు చేపట్టాల్సి ఉంది. దేవస్థానం మాస్టర్ ప్లాన్ 2010లో రూపొందించారు. ఆ తరువాత పలు మార్పులు చేశారు. రాబోయే రోజుల్లో మరికొన్ని నిర్మాణాలు చేపట్టనున్నారు. వీటన్నింటిని దేవస్థానం మాస్టర్ ప్లాన్‌లో చేర్చనున్నారు.

ప్రస్తుతం ఏమి ఉన్నాయంటే...

ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లో కొత్తగా సత్రాల నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. నిర్మాణాలన్నీ సత్యగిరిపై చేపట్టాలని, మరిన్ని టాయిలెట్‌లు నిర్మించాలని, భక్తుల వాహనాల రాకపోకలకు వీలుగా ఘాట్‌రోడ్లు వెడల్పు చేయాలని, కొత్తగా క్యూ లు నిర్మించాలని అనుకున్నారు.

కొత్తగా మాస్టర్ ప్లాన్‌లో చేర్చుతున్న అంశాలు

- దేవాలయానికి నాలుగు మాడావీధుల నిర్మాణం



కొండదిగువన టోల్‌గేట్ పక్కన నిర్మిస్తున్న భక్తుల షెడ్లు

- భక్తులు ఏటా 40 శాతం చొప్పున పెరగడం, వ్యక్తిగత వాహనాలపై వచ్చే భక్తులు ఎక్కువ కావడంతో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు
- వాహనాలు కొండ దిగువకు వెళ్లేందుకు ఎక్కువ రోడ్ల నిర్మాణం
- అన్నదాన శాల నుంచి, వివిధ సత్రాల నుంచి వచ్చే వ్యర్థాలు, టాయిలెట్స్ నుంచి వచ్చే వేస్ట్‌కూ సూయెజ్ ట్రీట్మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ల నిర్మాణం
- దేవస్థానంలో వివిధ చోట్ల, ఘాట్‌రోడ్లలో విద్యుత్ దీపాలు, అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటు



అన్నవరం దేవస్థానం మాస్టర్ ప్లాన్

- మారేడు, తులసి వనాలు, మామిడి, అరటి తదితర చెట్లు విరివిగా పెంచే చర్యలు
- వివిధ పుష్పాలతో కూడిన తోటల పెంపకం
- వసతి గదులు దొరకని భక్తులు సేద తీరేందుకు విశ్రాంతి షెడ్ల నిర్మాణం
- కొండ దిగువన భక్తుల కోసం మరిన్ని నిర్మాణాలు

భక్తుల అవసరాల మేరకు మార్పులు



గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో కొత్తగా చేర్చాల్సిన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనుల గురించి ప్రతిపాదనలు ఈ నెలాఖరులోగా పంపించాలని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. త్వరలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులతో సమావేశమై వారి అభిప్రాయాలు తీసుకుని కమిషనర్‌కు నివేదిక పంపుతాం. దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఇప్పటికే చేపట్టిన పలు నిర్మాణాలు మాస్టర్ ప్లాన్‌లో చేర్చుతాం.

– చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

రోడ్డు ప్రమాదంలో గోపాలమిత్ర మృతి



శివశంకర్ (ఫైల్)

అంబాజీపేట: మాచవరం 3 సచివాలయంలో గోపాలమిత్రగా విధులు నిర్వహిస్తున్న వాకలగరువుకు చెందిన నవుండ్రు శివశంకర్ (40) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివశంకర్ మంగళవారం రాత్రి విధులు నిర్వహించుకుని బైక్‌పై ఇంటికి వెళుతున్న సమయంలో స్థానిక స్త్రీల ఆస్పత్రి సమీపంలో ఉన్న దొమ్మేటి వారిపాలెం వద్ద కొబ్బరి చెట్టును ఢీ కొట్టారు. గాయపడిన ఆయనను 108లో అమలాపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. మృతుడి పెద్దమ్మ కుమారుడు ఉందుర్తి పల్లపురాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. శివశంకర్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ పరామర్శించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో శిక్షణ శిబిరం



ఏపీ జట్టుతో ఆర్‌జేడీ రాజు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర స్థాయి ఖోఖో శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెళుకువలతో జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆర్‌జేడీ రాజు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఖోఖో సంఘం సహకారంతో జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్టీయూకే క్రీడాప్రాంగణంలో వారం రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో శిక్షణ శిబిరం బుధవారం సాయంత్రంతో ముగిసింది. ఈ ముగింపునకు కాకినాడ డివిజన్ డీవైఈఓ రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమానికి ఖోఖో సంఘ కార్యదర్శి పట్టాభి అధ్యక్షత వహించారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారిణులు కోచ్‌లు శ్రీనివాస్, సీహెచ్ లోవలక్ష్మి మెళుకువలు నేర్పించారు. అండర్–14,18 విభాగాల్లో క్రీడాకారిణులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. బెంగళూరులో ఈ నెల 6 నుంచి 8 వరకు జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీలలో వీరు పాల్గొంటారు. శిబిరంలో పాల్గొన్న క్రీడాకారిణులకు క్రీడాదుస్తులు జేఎన్టీయూకే పీడీ శ్యాంకుమార్ స్పాన్సర్ చేశారు. వీటిని ఆర్‌జేడీ రాజు అందజేశారు.

ఆలితో తగవెందుకు అన్నందుకు హత్య

- బంధువుల సాయంతో ఇంట్లోకి చొరబడి కర్రలు, గునపాలతో దాడి
- తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందిన వైనం



అబ్బులు (ఫైల్)

గండేపల్లి: నీ భార్యను ఎందుకు తిడుతున్నావు అని ప్రశ్నించిన వ్యక్తితో ఘర్షణ పడి, తన బంధువుల సాయంతో అతనిని హత్య చేసిన ఘటన పి.నాయకంపల్లి చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గండేపల్లి మండలంలోని పి.నాయకంపల్లికి చెందిన గంధం అబ్బులు (62) గ్రామ పంచాయతీ స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. అతని ఇంటి ఎదురుగా ఉంటున్న గంధం విజయకుమార్ మంగళవారం సాయంత్రం తన భార్య శాంతమ్మతో గొడవ పడి తిడుతుండగా అబ్బులు జోక్యం చేసుకుని ఎందుకు అలా తిడుతున్నావని అడిగాడు. 'నీ కేంటి సంబంధం. నా భార్యను నేను తిట్టుకుంటాన'ని విజయకుమార్ అనడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ వాగ్వివాదంలో విజయకుమార్ కర్రతో అబ్బులుపై దాడి చేశాడు. అనంతరం అబ్బులు కర్రతో విజయకుమార్‌పై దాడి చేయడంతో అతని తలకు గాయమవగా స్థానికంగా ఉన్న పీఎంపీ వైద్యునితో చికిత్స చేయించారు. అనంతరం తన ఇంటికి అబ్బులు వెళ్లిపోయాడు. రాత్రివేళ విజయకుమార్, సమీప బంధువులైన గంధం శాంతమ్మ, ముప్పిడి వెంకటలక్ష్మి, వేమగిరి వరలక్ష్మి, కొమ్ముకూరి బేబమ్మ, గంధం సుబ్బమ్మ కర్రలు, గునపాలతో అబ్బులుపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలికి చేరుకున్న జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు, గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్, సిబ్బంది శవ పంచనామా నిర్వహించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందుకు కారణమైన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు.



రక్తం మడుగులో ఉన్న మృతదేహాన్ని చూసి ఆందోళనతో చుట్టుపక్కలవారు, బంధువులు

భార్య, కుమార్తెలు కన్నీరుమున్నీరు

మృతునికి భార్య కృపావతి, కుమార్తెలు మోర్త ఆశమ్మ, ముప్పిడి వెంకటలక్ష్మి, కందుకూరి దుర్గభవాని, దొండపాటి నాగమణి ఉన్నారు. మృతుని నాలుగో కుమార్తె నాగమణి డెలివరీ నిమిత్తం పది రోజులుగా కుటుంబ సభ్యులంతా కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంటున్నారు. మృతుడు అబ్బులు ఒక్కడే ఇంట్లో ఉండటంతో ఒంటరిని చేసి ఈ దారుణానికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘర్షణ పడ్డ ఇద్దరూ బంధువులేనని, ఆ సమయంలో అబ్బులు, విజయకుమార్ మద్యం సేవించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.



రోదిస్తున్న మృతుని భార్య, కుమార్తెలు, బంధువులు



వివరాలు నమోదు చేసుకుంటున్న సీఐ, ఎస్సై, సిబ్బంది

సాక్షి క్లాసిఫైడ్స్

Education

TUTIONS

■ ఇంటర్ (EAMCET, JEE) డిప్లమో, బి.టెక్, B.Sc., B.Com.,(ఆల్ సబ్జెక్ట్స్) 1 to 10th ట్యూషన్స్ & హోం ట్యూషన్స్, స్పోకెన్ ఇంగ్లీష్, DCA, C, జావా, పైథాన్ Cont బి.టెక్ అకాడమీ, రాజమండ్రి. ✆ : 92472 46181 [R-115]

Real Estate

PLOT FOR SALE

■ కోలమూరు, బూరుగుపూడి మరియు గాదరాడ గ్రామంలో రెడీగా ఇల్లు కట్టుకొనుటకు ఇళ్ళ స్థలములు అమ్మకమునకు కలవు. గజం రేటు 5,000/- నుండి ప్రారంభం. ఫోన్: 94932 22215 P [V-2170]

TO-LET

■ అద్దె కొరకు : రాజమండ్రి వెంకటేశ్వరనగర్ త్రిమూర్తి ఎన్క్లేవ్‌లో 1st Floor లో సెమి ఫర్నిష్డ్ 3 BHK Flat అద్దెకు కలదు. సంప్రదించండి. ✆ : 79037 57988 [R-6172]

Services

BUSINESS OFFER

■ ప్రముఖ ఇంజిన్ ఆయిల్ కంపెనీకి డిస్ట్రిబ్యూటర్స్ / డీలర్స్ కావలెను. సంప్రదించండి. ✆ : 96633 63813 & 79950 63813 [R-109]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999 [B-6056]

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6214]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2381]

ASTROLOGY

■ ఓం శ్రీ దుర్గా భవాని జ్యోతిష్యాలయం విద్య, వ్యాపారం, ఉద్యోగం, విదేశీయానం, ప్రేమ, పెళ్ళి, సంతానం, కుటుంబం, ధనం, ఆరోగ్యం, వశీకరణం అన్ని సమస్యలకు అంజనం ద్వారా 11 రోజుల్లో పరిష్కారం. గురూజీ సహదేవరాజు. 9959975545. [W-1229447]

Wanted

■ రాజమండ్రి, నావవరం, లాలాచెరువు ప్రా॥ కం॥ ATM, షోరూమ్స్, స్టార్ హోటల్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్స్ కావలెను. జీ॥ 12 to 15 వేల. రూం + భో, వసతి. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. ✆ 93922 69369 [R-93]

■ వైష్ణవి చిల్డ్రన్ హాస్టల్‌లో ఉండి వార్డెన్స్, ఆఫీస్ స్టాఫ్ స్త్రీలు & పురుషులు కావలెను. Q : Inter / Degree మంచి జీతం, రూమ్ + ఫుడ్ హౌ.నెం. 107, మున్సిపల్ కాలనీ, RJY. ✆ 93819 45629 [R-6212]

■ హైదరాబాదులో అప్తా ఎల్డర్‌కేర్‌లో ఉద్యోగ అవకాశం. M/F కేర్ టేకర్స్ కావలెను. జీతం: 16-20వేలు, వయస్సు: 21-45, భోజన వసతి ఇన్సూరెన్స్ కలవు. సంప్ర॥ 6300813664 [G-1140]

■ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 12,000+ట్రావెల్ అలవెన్స్+ఇన్సెంటివ్స్, అర్హత: డిగ్రీ, వయస్సు: 20–32, ఫోన్ నెంబర్: 9381848549 [G-1141]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221732]

■ కష్టలేన్సీకాదు. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ:12,000/- - 35,000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 7995984445. [HA-668]

■ మా ఆఫీసు న్యూ ప్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801126]

■ శ్రీసాయిరాం హోమ్‌కేర్ Hyd లో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసు కొనుటకు స్త్రీ/పు.కావలెను. జీతం: 18000/- ఏజెంట్ కమీషన్ 7K. 9666001826, 9666001827 [H-793403]

■ కొత్తగా ప్రారంభించిన మా DSI కంపెనీలో వర్క్ చేయడానికి గృహిణులు, నిరుద్యోగులు, ఉద్యోగస్తులు కావలెను. స్మార్ట్ ఫోన్ ద్వారా చేయాలి. నెలకు 30,000 సంపాదన ✆ 99852 00299 [B-436]

■ కష్టలేన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP&డాక్టర్స్ కావలెను. జీతం: 13,000/- - 35000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 79953 74999 [HA-684]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం:18K. Ph:96404 68899/ 96402 58899 [HA-189338]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీసెస్ (AP NO-1) VJA, HYD శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, వంట/ ఇంటి పని, బేబీ కేర్ వర్కర్స్ కావలెను భో+వ+జీ: 15-21 వేలు ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 62812 08656, 62812 08600 [B-1068140]

■ కష్టమర్‌కేర్ ఆఫీస్ ఇన్‌ఛార్జ్ కావలెను. B.Tech., వారికి ప్రాధాన్యత. జీతం: రూ.15,000 నుండి రూ.20,000 వరకు. Cont: శ్రీ దేవి హోండా, ఆథరైజ్‌డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. సెల్ : 94909 98888 [R-95]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అంతరిక్ష వారోత్సవాలకు అంతా సిద్ధం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు రాజమహేంద్రవరంలో గురువారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ ఎస్.విజయకుమార్ చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేట్ కాలేజెస్ అసోసియేషన్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ సంయుక్త సహకారంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆయన బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏటా ఏదో ఒక అంశానికి ప్రాధాన్యమిస్తూ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తుండగా ఈ ఏడాది 'స్పేస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్' పేరుతో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజమహేంద్రవరంతో పాటు విశాఖ, కర్నూల్, శ్రీహరికోటలో వారోత్సవాలు చేస్తున్నామని చెప్పారు. తమిళనాడులోని విల్లుపురం, కోయంబత్తూరు, తంబళ్లపల్లి, ఒడిశాలోని పూరీలలో వారోత్సవాలు చేస్తున్నట్లు చెప్పారు. మిగిలినచోట్ల అన్ని సౌకర్యాలున్న ఇంజినీరింగ్ కాలేజీలలో చేస్తుంటే రాజమహేంద్రవరంలో మాత్రం ప్రజల మధ్య చేస్తున్నట్లు ఆయన చెబుతూ అందుకే ఇస్రో దృష్టి ఇక్కడే కేంద్రీకృతమయిందన్నారు. ఇప్పటికే క్విజ్ పోటీలు కూడా జిల్లాలోని 19 మండలాల్లో నిర్వహించారని, డ్రాయింగ్ పోటీలు జరిగాయని, ఇందులో విజేతలకు 8వ తేదీన బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. 6వ తేదీన కళాకేంద్రం ఆవరణలో ఇస్రో పరికరాలు, రాకెట్స్ నమూనాల ప్రదర్శన ప్రారంభిస్తామని, వీటి గురించి వివరించడానికి వీలుగా ఇప్పటికే 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అదే రోజు కళాకేంద్రంలో 10/20 స్క్రీన్‌పై ప్రదర్శనలు ఇచ్చి, స్లాట్ వారీగా 8,9,10 విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాజమహేంద్రవరం విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గురువారం ఉదయం 9.30 గంటలకు నందం గనిరాజు జంక్షన్ నుంచి కంబాల చెరువు, దేవీచౌక్ మీదుగా శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం వరకు వేలాదిమంది విద్యార్థులతో స్పేస్ వాక్ ఉంటుందని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ విజయకుమార్

వృద్ధురాలి దారుణ హత్య

- నిద్రిస్తుండగా ఘాతుకానికి పాల్పడిన దుండగులు
- కణుపూరులో కలకలం
- పోలీసుల ముమ్మర దర్యాప్తు



పార్వతి మృతదేహం

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరులో తల్లోజు పార్వతి (75) దారుణ హత్యకు గురైంది. తన ఇంట్లో మంగళవారం రాత్రి నిద్రించిన ఆమె బుధవారం ఉదయానికి రక్తపు మడుగులో పడి ఉంది. కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కణుపూరు మెయిన్ రోడ్డు బ్రహ్మలవీధిలో పార్వతి నివాసం ఉంటోంది. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన మూడో కుమారుడు వెంకటేశ్వర్లు ఇంట్లో టీవీ సీరియల్ చూసింది. అనంతరం నాలుగో కుమారుడు వీరబాబు ఉంటున్న తన ఇంటికి వచ్చి నిద్రించింది. బుధవారం తెల్లవారేసరికి చనిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూజ్ బృందాలు వచ్చి ప్రాథమిక ఆధారాలను సేకరించాయి. రక్తపు మరకలు ఉన్న నైటీని ఆ ఇంటి లోపల షెడ్‌లో గుర్తించాయి.

బలమైన కర్రతో కొట్టి..

పోలీసు డాగ్ తొలుత ఇంటి నుంచి బయటకు వచ్చి మెయిన్ రోడ్డు మీదుగా సమీప ఇంటి వైపునకు పరుగులు తీసింది. తర్వాత మృతురాలి ఇంటి ఆవరణలోని షెడ్డులోకి వెళ్లింది. అనంతరం రోడ్డు మీదకు వచ్చింది. అలాగే క్లూజ్ టీమ్ ఘటనా స్థలంలో వేలిముద్రలు, మృతిరాలి తలపైనున్న మరకలను పరిశీలించింది. తలపై బలమైన కర్ర లేదా రాడ్డుతో కొట్టి చంపిఉంటారని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు అనుమానితులను విచారణ చేస్తున్నారు. తల్లోజు పార్వతికి తొమ్మిది మంది సంతానం. వారిలో ఐదుగురు కూతుర్లు, నలుగురు కుమారులున్నారు. కుమార్తెలకు పెళ్లిళ్లు కావడంతో వేరే గ్రామాల్లో ఉంటున్నారు. కుమారుల్లో చిన్నవాడితో పాటు ఉమ్మడి ఇంట్లో పార్వతి నివసిస్తోంది. ఆమె భర్త సుబ్బారావు గతంలోనే మృతి చెందాడు.



ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసు డాగ్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కట్టా శారదా సతీష్

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి మృతి

యానాం: మున్సిపల్ శానిటరీ వర్కర్ పాలెపు ఆనంద్‌కుమార్ వర్మ(46) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. కురసాంపేటలోని తన ఇంట్లో గుండెపోటు రావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఆర్‌సి నెం. 01/2023/ఏ2 తేది 04/10/2023

పురపాలకసంఘ కార్యాలయము

బహిరంగ వేలము నోటీసు

తుని పురపాలక సంఘమునకు చెందిన జనరల్ మార్కెట్, రోజు మార్కెట్ అనుభవించే హక్కును 2023–24 సం. సంబంధించి ది 01-11-2023 నుండి 31-03-2024 వరకు ఆశీలు వసూలు చేసుకొనుటకు లైసెన్సు ఇచ్చుటకు ది 07/10/2023 శనివారము ఉదయం 11.00 లకు నుండి తుని పురపాలకసంఘ కార్యాలయము నందు కమీషనరు వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వేలపాట అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. వేలము నందు పాల్గొను వారు కాకినాడ జిల్లా గెజిట్ నోటిఫికేషన్ నెం02/2023 నందు గల నియమ నిబంధనలకు లోబడి 'బహిరంగ వేలం' యందు పాల్గొనవలెను.

ఇతర వివరముల కొరకు మున్సిపల్ రెవెన్యూ అధికారి / రెవెన్యూ ఇన్స్పెక్టర్ వార్లను గాని లేదా సంబంధిత గుమాస్తా వారిని గాని కార్యాలయ పనివేళల యందు సంప్రదించవలసిందిగా కోరడమైనది.

కమిషనరు, తుని పురపాలక సంఘం

శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం

అయినవిల్లి గ్రామం - మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఇ-టెండర్/సీల్డ్ టెండర్/బహిరంగ వేలం ప్రకటన (4 వ. పిలుపు)

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం & గ్రామం. శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం నకు భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొని తీసుకొని వెళ్ళు లైసెన్సు హక్కు నకు ది.16.11.2023 నుండి ది.15.11.2024 వరకు 1 సంవత్సర కాలమునకు ది.11-10-2023 బుధవారం మ.గం.1.00 లకు దేవస్థానం కార్యాలయం, అయినవిల్లి వద్ద ఆలయ ధర్మకర్తల మండలి, దేవదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించుటకు ఇ-టెండర్/సీల్డ్ టెండర్/బహిరంగ వేలం పాట కోరడమైనది. ఇ- టెండర్ దాఖలు చేసుకొనుటకు http://tender.apeprocurement.gov.in లాగిన్ అయి A.P. endowments Department నందు Circle : Sri Vighneswara Swamy Temple, Inavilli నుండి టెండర్ షెడ్యూల్స్ పొందవచ్చును.

టెండర్ వివరములు	ధరావత్తు	పాట వివరములు
శ్రీ స్వామి వారికి భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొని తీసుకొని వెళ్ళు లైసెన్సు హక్కునకు ది.16.11.2023 నుండి ది.15.11.2024 వరకు (1 సంవత్సరము)	2,00,000/	బహిరంగవేలం: ది. 11/10/2023 మధ్యాహ్నం గం. 1.30 లకు సీల్డ్ టెండర్ దాఖలు : ది. 11/10/2023 మధ్యాహ్నం గం.1.00 లకు సీల్డ్ టెండర్ తెరచు సమయం : ది.11/10/2023 మధ్యాహ్నం గం.2.00 లకు ఇ-టెండర్ : ది.08.10.2023 నుండి ప్రారంభం ఇ టెండర్ ఆఖరు తేది ది.11.10.2023 మ. గం. 12.00 ల వరకు ఇ-టెండర్ తెరచు సమయం: ది.11.10.2023 మ. గం. 2.15 లకు

ముఖ్య షరతులు : (1) ధరావత్తు (Tender Deposit) The Executive officer, Sri Vighneswara Swamy Temple, Ainavilli పేరున ఏదైనా జాతీయ బ్యాంక్ నుండి D.D. తీసి జతపర్చవలెను. (2) టెండర్ షెడ్యూల్ ది.05.10.2023 నుండి ది.11.10.2023 వరకు దేవస్థాన కార్యాలయం పనివేళలలో రూ.500/–లు చెల్లించి పొందగలరు. (3) పూర్తి వివరములు కార్యాలయం నందు పొందవలెను. వివరములకు 9490225812/94910 07474 (4) ఇ-టెండర్ నందు పాల్గొనే టెండరుదారులు ధరఖాస్తు ధర రూ.500/- మరియు ధరావత్తు Online ద్వారా చెల్లించవచ్చును. ఇట్టి టెండరుదారులు సదరు రశీదుతో బహిరంగ వేలం నందు పాల్గొనవచ్చును.

తేది: 03.10.2023 స్థలం: అయినవిల్లి

శ్రీ గుత్తుల నాగబాబు, చైర్మన్ & ధర్మకర్తలమండలి

శ్రీ ముదునూరి సత్యనారాయణరాజు, కార్యనిర్వహణాధికారి

దసరా మహోత్సవాలకు రాట ముహూర్తం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాలకు బుధవారం రాట ముహూర్తం చేశారు. ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పండితులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా వెలగొందుతున్న మాణిక్యాంబా అమ్మవారికి ఈ ఏడాది దసరా తొమ్మిది రోజులు ఆలయ చరిత్రలో తొలిసారిగా అవతారాల్లో అలంకరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఈఓ పితాని తారకేశ్వరరావు తెలిపారు. 15న బాలాత్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీ దేవి, 17న అన్నపూర్ణా దేవి, 18న మహాలక్ష్మి, 19న మహాచండీ , 20న సరస్వతీ, 21న లలితా త్రిపుర సుందరి, 22న దుర్గాదేవి, 23న మధ్యాహ్నం 12 గంటల వరకు మహిషాసురమర్దని, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారిని అలంకరిస్తారని చెప్పారు.



రాట ముహూర్తంలో పాల్గొన్న ఈవో, పండితులు, గ్రామ పెద్దలు